పదం దృక్పథం
సాయి బ్రహ్మానందం గొర్తి

# తెలుగువాడనైతి

## అన్నమయ్య పదాలు  సామాజిక దృక్పథాలు

ఏ భాష అయినా కాలాన్ని బట్టి రూపాంతరం చెందుతూ ఉంటుంది.పూర్వం రాజులు పాలించేటప్పుడైతే రాజు ఏ భాషని అధికార భాషగా నిర్దేశిస్తాడో అదే, ప్రజలూ ఇష్టమున్నా, లేకపోయినా మాట్లాడేవారు. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించేటప్పుడు అధికార భాషగా మొదట కన్నడం ఉండేది. తెలుగు భాషమీద మక్కువతో రాయలు తెలుగుని కూడా ప్రజల భాషగా గౌరవించాడు. అది ఎంతవరకూ వెళ్ళిందంటే తెలుగు రాజ భాష గా మారిపోయే స్థితికి వెళ్ళింది. శ్రీ కృష్ణ దేవరాయల తరువాత విజయ నగర ప్రాభవం తగ్గింది. ఆక్రమణలూ, చీలికలూ పెరిగాయి. యుద్ధాలు అనివార్యం అయ్యాయి. బహమనీ సుల్తానుల ఆక్రమణతో ఉర్దూ భాష ఉత్తర హిందూస్థానం నుండి దక్షిణం వైపుగా మరలింది. రాజులు మారి, రాజ్యాలు కొల్లగొట్టినప్పుడల్లా భాష కూడా మారుతూ వచ్చింది. నరసింహరాయలు పరిపాలించేటప్పుడు గజపతులు విద్యానగరం పై దండెత్తారు. విజయనగరం ఆక్రమణకి గురి అయ్యింది. గజపతుల భాష ఒడ్డె భాష ! యావత్తు రాజ్య ప్రజలూ తప్పని సరిగా ఒడ్డె భాష మాట్లాడి తీరాలి అని నిర్బధించారు గజపతులు. అంతవరకూ తెలుగు భాషనే తమ భాషగా పరిగణించే ప్రజలు వేరొక కొత్త భాషనేర్చుకోవాల్సి వచ్చింది. అన్నమయ్య కిది సబబుగా తోచ లేదు. భాషని ప్రజలపై బలవంతంగా రుద్దడం అనేది ఇష్టంలేక ఈ క్రింది కీర్తన చెప్పాడు.

అన్నియు నా యందె కంటి నన్నటివాడా నేనే
మున్నె నా భావముతో ముడిజివేసినది.    -- పల్లవి - -

వాడ వాడలా నేనూ నా కీర్తనలూ నిండి ఉన్నామనే భావన ఇంతకుముందు ఉండేది. ఇప్పుడు వొడ్డె భాష వచ్చాక నా భావము తప్పు అని నిరూపించ బడింది అంటూ వాపోయాడు.

చెలగి సంసారమే జింతించి సంసారినైతి
ములిగి ముక్తి దలజి ముక్తుడనైతి
పలు మతాలు దలజి పౌషండ బుద్ధి నైతి
చెలగి శ్రీపతి దలజి వైష్ణవుడనైతి    -- అన్నియు --

యువ్వనంలో వివాహం చేసుకొని సంసారి నయ్యాను. అ తరువాత భక్తి భావం కలిగి ముక్తి వైపు మళ్ళింది మనసు. శ్రీపతిని తలచి వైష్ణవుడనయ్యాను.

పాసగ పుణ్యం సేసి పుణ్యాత్ముడనైతి
పసల బాపము చేసి పాప కర్ముడనైతి
వెస బ్రహ్మ చారి నైతి యాచారమున
ముసిగి మరొకాచారమున సన్యాసినైతి    -- అన్నియు --

పాప పుణ్యాలననుసరించి పాపకర్ముడనయ్యాను. ఒక్కో సారి మంచి చేసి పుణ్యాత్ముడనయ్యాను. ఆచారాలని బట్టి ఒక్కోసారి ఒక్కో రీతిగా మారుతూ వచ్చాను.

నొగి నొడ్డెభాష లాడి వొడ్డెవాడనైతి
తెగి తెలుగాడ నేర్చి తెలుగువాడనైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీ దాసుడనై దాసరి నేనైతి -- అన్నియు --

బలవంతాన ఒడ్డె భాష నేర్చుకుంటూ ఒడ్డె వాడనయ్యాను. తేట తెలుగు అవపోసన బట్టి తెలుగు వాడినయ్యాను. ఇలా రకరకాల మార్పులు చెందుతున్న నేను (అనగా అన్నమయ్య ) అన్నీ విడచి శ్రీహరి దాసుడనయ్యాను " అంటూ తనకిష్టంలేని పని అంటే ఒడ్డె భాష నేర్చుకోవడానికి మనసు లేదంటూ ఆక్రోశించాడు.

కానీ నేడు పరిస్థితులు మారాయి. తెలుగు భాష తన స్థానం మెల్ల మెల్లగా కోల్పోతోంది. ప్రపంచీకరణలో స్థానిక భాషల ప్రాపకం తగ్గుతోంది. కానీ ఎంతైనా మాతృభాషని మించిన అమృతం లేదు. అది అస్వాదించాలే కానీ ఎంత తాగినా దాహం తీరని రస గంగ!

అ గంగని ఎండిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ అని చెప్పడానికి అన్నమయ్య కీర్తనలే సాక్షి

